స్వామివారి కల్యాణం

ఎన్ఎండీసీ సమీపంలోని దేవునికుంట వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం వేంకటేశ్వర కల్యాణం కనుల పండువగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్‌పర్సన్ ఎం.ఎస్.ఉషాప్రభాకర్ రావు, నాయకులు అమరేందర్ రెడ్డి, సురేశ్ నాయక్, శంకర్ లాల్ పాల్గొన్నారు. ఆదివారం నుంచి ధనుర్మాస మహోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ చైర్‌పర్సన్ తెలిపారు. జనవరి 16 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని, నెల 29న ముక్కోటి ఏకాదశి రోజున ఆలయంలో ప్రత్యేక పూజలు, ఉత్తర ద్వార దర్శనం కోసం ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె తెలిపారు. **- మెహిదీపట్నం, డిసెంబర్ 16**

ప్రజలకు అందుబాటులో ఉంటాం

ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధిని అందించడానికి కృషి చేస్తామని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అన్నారు. శనివారం ఆసిఫ్‌నగర్ డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కనీస సౌకర్యాలను సమకూర్చడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి ఎండీ.మూసా, స్థానిక నాయకులు పాల్గొన్నారు. **- మెహిదీపట్నం, డిసెంబర్ 16**

ఆలయ స్థలానికి రక్షణ చర్యలు

అశ్వశాల వద్ద బోర్డు ఏర్పాటు చేసిన దేవాదాయ శాఖ అధికారులు

కార్వాన్, డిసెంబర్ 16 : గుడిమల్కాపూర్‌లోని 500 ఏండ్ల చరిత్ర ఉన్న జాంసింగ్ వేంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన దాదాపు 50 ఎకరాల స్థలం ఉన్నది. ఆ స్థలంలోనే కూరగాయల మార్కెట్, ఇంద్రారెడ్డి పూల మార్కెట్, రిటైల్ కూరగాయల మార్కెట్లను ఏర్పాటు చేశారు. ఆ స్థలం పోగా ఇప్పుడు ఆలయం ఉన్న స్థలం 10 ఎకరాల వరకు ఉంటుంది. ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న ఈ ఆలయానికి ప్రధాన గేటుకు కుడి వైపు స్వామి కొలువై ఉండగా మరోపక్క రథం నిలిపేందుకు పురాతన కట్టడం ఉన్నది. దానికి కొద్ది దూరంలో మరో పురాతన కట్టడం అశ్వశాల ఉన్నది. వారం రోజుల క్రితం ఇద్దరు ఆలయ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి ఇది ప్రార్థనా స్థలమంటూ వీడియో వైరల్ చేశారు. దీంతో దేవాదాయ శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు గుడిమల్కాపూర్ పోలీసులు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన పై స్పందించిన దేవాదాయ శాఖ అధికారులు అశ్వశాల ఉన్న చోట బోర్డును ఏర్పాటు చేశారు. అధికారులు మాట్లాడుతూ.. జాంసింగ్ వేంకటేశ్వర స్వామి ఆలయం దేవాదాయ శాఖకు చెందినదని ఎవరైనా సరే తమ అనుమతి లేకుండా వస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

సన్మానం

జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన అంబికా నగర్‌కు చెందిన రామగిరి స్వారికను శనివారం గౌలిపుర కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి శాలువాతో సన్మానించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. పాతనగరంలో పుట్టి పెరిగిన స్వారిక మరిన్ని విజయాలు సాధించి యువతకు ఆదర్శంగా నిలువాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఈ.సుమన్ ముదిరాజ్, జె.అశోక్, కె.రాజ్‌కుమార్, బి.రమేశ్ పాల్గొన్నారు. **- చాంద్రాయణగుట్ట, డిసెంబర్ 16**

అనువర్తిత జంతుశాస్త్రానికి ఉజ్వల భవిష్యత్

కోఠిలోని టీఎంవీలో నిర్వహించిన సెమినార్‌లో పాల్గొన్న తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ విజ్జులత

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 16 : అనువర్తిత జంతుశాస్త్రం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు దోహదం చేస్తుందని తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.విజ్జులత పేర్కొన్నారు. శనివారం టీఎంవీ హైదరాబాద్ చాప్టర్, జువాలజీ విభాగం, టీఎంవీ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీజీ సెమినార్ హాల్‌లో అనువర్తిత జంతుశాస్త్రంపై సెమినార్‌ను నిర్వ హించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి సెమినార్ ను ప్రారంభించిన ప్రొఫెసర్ విజ్జులత మాట్లాడుతూ.. ఇటువంటి సెమినార్లు ని విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకను వెలికి తీసి పురోగతిని మెరుగుపర్చుకోవడానికి దోహదపడుతాయన్నారు. సెమినార్‌లో పాల్గొన్న వారు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఉస్మానియా మహిళా కళాశాల శతాబ్ది ఉత్స వాల్లో భాగంగా సెమినార్లు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ నాగయ్య, డాక్టర్ ప్రదీప్ కునాల్, సునిత కుమారి, ప్రొఫెసర్ నాగరాజారావు, వీణా మధుసూదన్, ప్రదీప్ కుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.

అరుణాచలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక టూర్ ప్యాకేజీ

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 16 : ఈ నెల 26న పౌర్ణమిని పురస్కరించుకొని అరుణాచలానికి టీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు లను నడుపుతున్నట్లు రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ ఏ శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

24న రాత్రి 8 గంటలకు ఎంజీబీఎస్‌లో బయలుదేరి కాణిపాకం విఘ్నేశ్వరుడి ఆలయం, వేలూరు గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం 25న రాత్రి 10 గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. 26న అరుణాచలంలో గిరి ప్రదర్శన అనంతరం బయలుదేరి 27న హైదరాబాద్ చేరుకుంటుందని అన్నారు. భక్తుల సౌకర్యార్థం ఒక్క ప్రయాణికుడికి రూ. 3690 చార్జీ ఉంటుందని అన్నారు. ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్ బస్‌స్టేషన్‌లతో పాటు జంట నగరాలలోని సమీప ఏటీబీ ఏజెంట్ల వద్ద ఈ టికెట్‌లను www .tsrtconline.in ద్వారా సీట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చని అన్నారు. సమాచారం కోసం ఎంజీబీఎస్ –9959226257 ,9959224 911, జేబీఎస్ – 9959226246 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గ్రామీణ యువతకు మ్యాజిక్ శిక్షణ

మ్యాజిక్ షో బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ప్రతినిధులు

రవీంద్రభారతి, డిసెంబర్ 16 : శ్రీలంక ,భారత దేశాల్లో గ్రామీణ పట్టన యువతకు మ్యాజిక్ శిక్షణ, ప్రదర్శన నిర్వహణకై శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఒప్పంద పత్రాలను మార్చుకున్నట్లు హైదరాబాద్ మ్యాజిక్ సర్కిల్ అధ్యక్షుడు టి.విజయకాంత్, శ్రీలంక మ్యాజిక్ సర్కిల్ అధ్యక్షుడు రోహన్ జయశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంవత్సర కాలం నుంచి పట్టణ,గ్రామీణ ప్రాంతాల యువతీ యువకులకు మ్యాజిక్‌లో శిక్షణ ఇవ్వడంతో పాటు మ్యాజిక్‌పై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. మ్యాజిక్ శిక్షణ ప్రతి యువతి,యువకులు అవగాహన పెంచుకొని శిక్షణ పొందాలని వారు సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ అమెరికా అసోసియేషన్ అధ్యక్షుడు వంశిరెడ్డి, రాష్ట్ర కో–ఆర్డినేటర్ డా. ద్వారకానాథ్‌రెడ్డి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహాను శనివారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలుపుతున్న ఉస్మానియా దవాఖాన క్వాలిటీ ప్రాపర్టీస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ఇన్‌చార్జి హసన్

- సుల్తాన్‌బజార్, డిసెంబర్ 16

మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ విగ్రహం ఏర్పాటు చేయాలి

విలేకరులతో మాట్లాడుతున్న విక్రమ్ గౌడ్

అబిడ్స్, డిసెంబర్ 16 : మాజీ మంత్రి ముఖేశ్ గౌడ్ విగ్రహాన్ని గోషామహల్ నియోజకవర్గంలోని ఎంజే మార్కెట్ చౌరస్తాలో ఏర్పాటు చేయాలని ఆయన తనయుడు విక్రమ్ గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మోజాంజాహి మార్కెట్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. నాలుగేండ్ల క్రితం జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి, మాజీ మంత్రి ముఖేశ్ గౌడ్ విగ్రహాలను నగరంలో ఏర్పాటు చేయాలని మల్కాజిగిరి ఎంపీ హోదాలో రేవంత్‌రెడ్డి అప్పటి అధికార బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరిన విషయం గుర్తు చేశారు. మూల ముఖేశ్ గౌడ్ కాంగ్రెస్‌లో సేవ చేశారని, మొదటి నుంచి కాంగ్రెస్‌లోనే ఉండి పార్టీ పటిష్టతకు పాటుపడటంతో పాటు పార్టీ కార్యకలాపాలను విస్తరింపజేశారన్నారు. పేద,బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని కోరారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

మెహిదీపట్నం, డిసెంబర్ 16 : టోలిచౌకి డివిజన్‌లోని నదీం కాలనీలో కలుషిత నీటి సరఫరాపై ఫిర్యాదులు అందడంతో జలమండలి అధికారులు స్పందించారు. తాగునీరు కలుషితం కావడానికి మురుగునీటి పైపు లీకేజీలు జరుగుతున్నట్లు గుర్తించారు. శనివారం అధికారులు ఆయా మరమ్మతు పనులు పూర్తి చేశారు. పనులను జలమండలి షేక్‌పేట్ డీజీఎం జవహర్ అలీ, ఎంఐఎం నాయకులు మహ్మద్ హరూన్ ఫర్హాన్‌తో కలిసి పరిశీలించారు.

మరమ్మతులు చేయిస్తున్న జలమండలి అధికారులు

శాంతి భద్రతలు పరిరక్షిస్తున్నాం

ప్రజల సహకారంతో శాంతి, భద్రతలు పరిరక్షిస్తున్నామని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం సాయంత్రం గోల్కొండ పోలీస్‌స్టేషన్ మైత్రి, పీస్ కమిటీ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్‌లను సన్మానించారు. పండుగలు, ఎన్నికల సందర్భంలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు విజయవంతంగా నిర్వహించినందుకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మైత్రి నాయకులు జైనుల్లాబెదిన్ ఆబేద్,అక్బర్, సాయిబాబా చారి తెలిపారు.

- మెహిదీపట్నం, డిసెంబర్ 16

సమస్యల పరిష్కారం కోసమే బీఆర్ఎస్

కార్వాన్, డిసెంబర్16 : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే బీఆర్ఎస్ ఉన్నదని కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఠాకూర్ జీవన్ సింగ్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందొద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో పాటు, ప్రజలకు ఇచ్చిన హామీల విషయంలో కలిసి కట్టుగా ఉద్యమించాలని కార్యకర్తలకు సూచించారు. ఉద్యమం అనేది బీఆర్ఎస్‌కు మారు పేరని ప్రజల కోసం ఇప్పుడున్న ప్రభుత్వంతో పోరాటం చేస్తామన్నారు. గుడిమల్కాపూర్ డివిజన్‌కు సంబంధించి ఒకవేళ ఉప ఎన్నిక జరిగితే తెలంగాణ ఉద్యమంలో పని చేసిన వారికి అవకాశం వచ్చేలా తనవంతు కృషి చేస్తానని జీవన్ సింగ్ అన్నారు. రాబోయే రోజులు బీఆర్ఎస్‌వే అని ఆశాభావం వ్యక్తం చేశారు.

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, డాక్టర్ కపిలవాయి లింగమూర్తి సాహిత్య కళాపీఠం, నాగర్‌కర్నూల్ వారి ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో అవార్డుల ప్రదానం, పుస్తకాల ఆవిష్కరణ నిర్వహించారు. ముఖ్య వక్తలుగా ఎన్.ముక్తేశ్వర రావు (రిటైర్డ్ ఐఏఎస్), ఆచార్య ఏల్చూరి మురళీధరరావు విచ్చేశారు. కపిలవాయి లింగమూర్తి మీనాక్షమ్మ సాహిత్య పురస్కారాన్ని పద్యనాటక కవి మహేశ్వరం అంబదాసు, కవి, చిత్రకారుడు దుబ్బాక కృష్ణస్వామిలకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కపిలవాయి అశోక్‌బాబు, పెద్దూరు వెంకటదాసు, ఎస్.వి.రఘువీర్‌ప్రతాప్ పాల్గొన్నారు.

- రవీంద్రభారతి, డిసెంబర్ 16

యువతి అదృశ్యం

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 16 : విధులకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన బేగంబజార్ పీఎస్ పరిధిలో శనివారం చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ నమిండ్ల శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆగాపురకు చెందిన ఉమారాణి పత్రా, తపస్ పత్రా భార్యాభర్తలు. వీరి కుమార్తె ఉషశ్రీ పత్రా ఎంజే మార్కెట్‌లోని కరాచి బేకరీలో పని చేస్తుంది. శుక్రవారం విధులకు వెళ్లిన ఉష శ్రీ మధ్యాహ్న భోజనానికి రాకపోవడంతో 3 :44 గంటలకు ఫోన్ చేశారు. ఉషశ్రీ ఫోన్ తన కోసం వెతకవద్దని కాల్ చేసి చెప్పిందని ఉమారాణి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సాయంత్రం 6 : 30 గంటల ప్రాంతంలో ఫోన్ చేయగా తాను రాయదుర్గం మెట్రోస్టేషన్‌లో ఉన్నానని, తిరిగి రాత్రి 8 గంటల ప్రాంతంలో ఫోన్ చేసి తనకు ఇంటికి తిరిగి రావడం ఇష్టంలేదని అన్నదని తల్లి పోలీసులకు తెలిపింది. దాంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.